సర్వే పకడ్బందీగా చేపట్టండి


హాజరు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. నర్సాపూర్ పురపాలిక పరిధి 8వ వార్డును పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తుండగా ఎమ్మెల్యే శుక్రవారం తనిఖీ చేశారు. సర్వేలో సేకరిస్తున్న వివరాలను కౌడిపల్లి తహసీల్దార్ ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. పుర అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నయీమొద్దీన్ తదితరులున్నారు. పట్టణంలోని 8వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంను ఎమ్మెల్యే సందర్శించి పిల్లల హాజరును పరిశీలించారు. తపాలా కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే గమనించారు. నెలలో నాలుగైదు రోజులు పింఛన్లు పంపిణీ చేస్తుండగా అన్ని రోజులు రోడ్డుమీద, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఉంటున్నామని లబ్ధిదారులు వాపోయారు.

బంగారమ్మ ఆలయంలో టీపీసీసీ అధ్యక్షుడి పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహేష్ కుమార్ గౌడ్, నాయకులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా నిజామాబాద్ వెళుతున్న సందర్భంగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు శాలువాలు, పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కాళ్లకల్‌లోని బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మెదక్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు, నర్సారెడ్డి, నాయకులు ఆవుల రాజిరెడ్డి, చెరకు శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, ఎలక్షన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మచారిణిగా వనదుర్గమ్మ..



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నవరాత్రులను పురస్కరించుకొని ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం గులాబి రంగు వస్త్రాలంకరణలో బ్రహ్మచారిణి(గాయత్రీ దేవి)గా అమ్మవారు దర్శనమిచ్చింది. ఆలయం వద్ద వరద ప్రవాహం ఉండడంతో రాజగోపురంలో అమ్మవారికి నిత్య పూజలు కొనసాగాయి. గోకుల్ షెడ్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మ రూపం.. అపురూపం


ప్రత్యేక అలంకరణలో రేణుకాంబ ఎల్లమ్మ

మెదక్ అర్బన్: శక్తి స్వరూపిణి దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు అమ్మవారు గాయత్రి, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాలు, మండపాల్లో అమ్మవారు ప్రత్యేక పూజలందుకున్నారు. పట్టణ శివారు పసుపులేరు ఒడ్డున గల రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో అమ్మవారిని తేజవంతంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

మంత్రి నాటితే మాకేంటి..!



మెదక్: మొక్కలు నాటడం తప్ప.. వాటిని పరిరక్షించకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇది ఎక్కడో కాదు సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ఆవరణలో ఇలాంటి పరిస్థితి నెలకొంది. గత నెల 26న కలెక్టరేట్‌లో మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు మొక్కలు నాటారు. వాటికి నీళ్లు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇప్పటికే మూడు మొక్కలు ఎండిపోయాయి.

అభ్యర్థుల అడ్డదారులు..!

అర్హత లేకున్నా ఈడబ్ల్యూఎస్ పత్రాల సమర్పణ

న్యూస్‌టుడే-మెదక్:

ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో గౌరవప్రదమైంది. ఎంతో కష్టపడితే గానీ ఉద్యోగం రాదు. అలాంటిది 1:3 నిష్పత్తిలో అర్హత సాధించిన వారిలో పలువురు అర్హత లేకున్నా ఎకనామికల్లి వీకర్స్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటాలో ధ్రువపత్రాలు సమర్పించారు. దీనిని గుర్తించిన ఇతర అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ... అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారిని పరిగణనలోకి తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

13 పోస్టులకు 39 మంది

జిల్లాలో 310 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల ఫలితాలు విడుదల చేయడంతో ఈనెల 3 నుంచి ఆయా కేటగిరిలోని పోస్టులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం ఓసీలకు ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేస్తోంది. ఈ కోటా కింద 13 పోస్టులకు గాను 1:3 నిష్పత్తిలో 39 మందిని పిలిచారు.

ఇద్దరు అభ్యర్థుల గుర్తింపు

వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉన్న ఓసీలకు రెవెన్యూ అధికారులు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం అందిస్తారు. దీని ఆధారంగా ఎస్జీటీ పోస్టులకు 1:3 నిష్పత్తిలో పిలుపు అందుకున్న వారిలో ఇద్దరు అభ్యర్థులు అర్హత లేకున్నా ధ్రువీకరణ పత్రం సమర్పించారు. దీనిని మరో ఇద్దరు అభ్యర్థులు గుర్తించారు. హవేలీఘనపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన భార్యాభర్తలిద్దరూ ఓ ప్రభుత్వ శాఖలో ఉద్యోగులు. భార్యకు ఎస్జీటీ పోస్టుకు పిలుపు రావడంతో గురువారం విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం సమర్పించింది. వాస్తవానికి భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా, వారు ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రం పొందేందుకు అనర్హులు. ఇద్దరి ఆదాయం కలిపితే ఏడాదికి రూ.లక్షల్లో ఉంటుంది. కొల్చారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు 1:3 నిష్పత్తిలో పిలిచారు. దీంతో ఆమె సైతం ధ్రువీకరణకు హాజరయ్యారు. ఈమె భర్త ప్రభుత్వ ఉద్యోగి. కానీ తండ్రి పేరిట ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందింది. వివాహం అయ్యాక భర్త పేరిట సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. ఇలా వీరు అర్హత లేకున్నా ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం గమనార్హం. 1:3 నిష్పత్తిలో వీరి తర్వాత ర్యాంక్ సాధించిన అభ్యర్థులు ఈ విషయాన్ని గుర్తించి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు.

తిరస్కరిస్తాం

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

ఇద్దరు అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్‌కు అర్హత లేకున్నా ధ్రువపత్రాలు సమర్పించారని మా దృష్టికి వచ్చింది. వారి దరఖాస్తులను తిరస్కరించనున్నాం. ఈ విషయమై అదనపు కలెక్టర్‌కు ఫైల్ పెట్టాం.

చర్యలు తీసుకోవాలి



అర్హత లేకున్నా తప్పుడు ధ్రువీకరణ పత్రం సమర్పించిన వారిపై చర్యలు తీసుకోవాలి. వీరివల్ల ఇతర అభ్యర్థులకు అన్యాయం జరగనుంది. ఈ విషయమై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. పోలీస్ అధికారుల వద్దకు వెళితే ఫిర్యాదు తీసుకోలేదు.
– నరేష్, డీఎస్సీ అభ్యర్థి, 302ర్యాంక్, రేగోడ్

న్యాయం చేయాలి



ఉపాధ్యాయ పోస్టు కోసం ఎంతో కష్టపడి చదివా. ఈడబ్ల్యూఎస్ కోటాలో పిలిస్తే వచ్చి ధ్రువపత్రాలు సమర్పించాం. కానీ మాకన్నా ముందు ర్యాంకులు సాధించిన వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్‌కు అర్హత లేకున్నా అందజేశారు. దీనిపై పూర్తి ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశాం. పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగిన న్యాయం చేయాలి. – నిఖిత, 315 ర్యాంక్, మెదక్

ధ్రువపత్రాల పరిశీలనకు నేడు చివరి అవకాశం

మెదక్, న్యూస్‌టుడే: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారంతో ముగుస్తుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరిశీలన జరుగుతుందని.. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలో ప్రత్యేక విద్య పోస్టులకు మినహాయించి అన్ని పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఆయా తేదీల్లో హాజరుకాని వారు శనివారం తప్పకుండా రావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు.

మూఢ నమ్మకాలను విశ్వసించొద్దు: ఎస్పీ


కాట్రియాలలో పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

రామాయంపేట, న్యూస్‌టుడే: మూఢనమ్మకాలను ప్రజలు విశ్వసించవద్దని, ఆరోగ్య సమస్యలు, జన్యు సంబంధమైన కారణాలు ఉంటాయని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఎవరైనా చేతబడి చేస్తున్నారనే ఆలోచనలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రామాయంపేట మండల పరిధి కాట్రియాల గ్రామానికి చెందిన ద్యాగల ముత్తవ్వ(50)పై చేతబడి నెపంతో పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన నేపథ్యంలో శుక్రవారం ఆయన గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ. . మహిళను అత్యంత దారుణంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేయడం దారుణమైన విషయమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సీఐ వెంకట రాజా గౌడ్ ఉన్నారు.

క్రీడల రాష్ట్రంగా మార్చడమే ధ్యేయం


కార్యక్రమ సభ్యులతో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణను క్రీడల రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు నిర్వహించిన సీఎం కప్ టార్చ్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతలను చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి , టార్చ్ కార్యక్రమ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, లైజన్ అధికారి మధు, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, మెదక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్, మెదక్ జిల్లా స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు జుబేర్, వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అనంతగిరి.. చూసి తనివి తీరాల్సిందే!

సెలవుల్లో సందర్శించాల్సిన స్థలం



న్యూస్‌టుడే, వికారాబాద్

వికారాబాద్‌ను ఆనుకొని వేలాది ఎకరాల్లో విస్తరించిన అనంతగిరి అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలను గుర్తించిన అప్పటి నిజాం ఏడో నవాబు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ ఛాతీ వైద్య ఆసుపత్రి (క్షయ చికిత్సాలయం) నిర్మించారు. ఇక్కడికి సమీప పట్టణాలు, గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం బీదర్, గుల్బర్గాకు చెందిన క్షయ పీడితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఎన్నో రకాల పక్షులు, వన్యప్రాణులకు ఈ ప్రాంతం నెలవైందని తేలింది. డెహ్రాడూన్ నుంచి ఔషధ మొక్కలు తీసుకొచ్చి అనంతగిరిలో నాటి ఔషధ ఝురిగా రూపొందించడానికి కృషి జరుగుతోంది.

ఆ మార్గంలో వెళ్తే ప్రకృతి మనల్ని పలకరిస్తుంది.. ఎత్తయిన గుట్టలు.. మయూరాల విన్యాసాలు.. పరుగులు తీసే జింకలు.. పక్షుల కిలకిలరావాలు.. అనంతపద్మనాభస్వామి ఆలయం.. ఇవన్నీ అనంతగిరి సొంతం. రాష్ట్రరాజధాని హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరంలోని అనంతగిరికి వస్తే సహజసిద్ధ ప్రకృతి ఒడిలో సేదతీరవచ్చు. ఇక్కడి కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటు షికారు చేయొచ్చు. ఇక్కడికొస్తే రోజంతా ఆహ్లాదంగా గడిపేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. మరెందుకు ఆలస్యం.. దసరా సెలవుల్లో అనంతగిరికి వచ్చి ఇక్కడి అందాలను ఆస్వాదించి వద్దాం పదండి.

అనంతగిరి విశేషాలు
విస్తరించిన ప్రాంతం 3750 ఎకరాలు
వన్య ప్రాణులు 16
పక్షులు 75
ఔషధ వృక్షాలు 307



బోటింగ్ షికారు

ఔషధ మొక్కల సంరక్షణ

అటవీ ప్రాంతంలోని మైదానాలు, ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలు నాటారు. వాటికి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అనువైన ప్రదేశాల్లో వేప, జిల్లేడు, నక్కెర, బిల్లేడు, ఉసిరి, మర్రి, మేడి, దంతి, గుంపెన, ఇప్ప, మామిడి, చింత, నల్లజీడి, చిల్ల, తాని, కరక, పాలకొడిశ తదితర ఔషధాలకు చెందిన వాటిని నాటి సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు

బుగ్గ రామలింగేశ్వరాలయం

అనంతగిరికి వచ్చిన పర్యాటకులు బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటుంటారు. త్రేతాయుగంలో రాముడు రావణ సంహారం తర్వాత ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శివలింగాన్ని అభిషేకించేందుకు రాముడు బాణం వేసి పాతాళగంగను పైకి రప్పించాడని ప్రతీతి. గంగ బుడగ రూపంలో రావడంతో బుగ్గ రామలింగేశ్వరుడు అన్న పేరు వచ్చిందని చరిత్ర. ఆలయంలోని నంది నోట్లో నుంచి నిరంతరం నీటి ధార వస్తూనే ఉంటుంది.

ప్రాజెక్టు చెంత

అనంతగిరిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు చూసి తీరాల్సిందే. వికారాబాద్‌కు 24 కి.మీ. దూరంలో ధారూర్ అటవీ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉంది. ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటుంది. బోట్‌లో షికారు చేసే అవకాశం ఉండటంతో అత్యధికులు ఇక్కడికి వస్తుంటారు. దట్టమైన చెట్లతో కూడిన ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి తరించాల్సిందే. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సందడిగా ఉంటుంది.

ఔషధ మొక్కల సంరక్షణకు..: ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎన్నో రకాల ఔషధ మొక్కలున్నాయి. మరిన్ని నాటి సంరక్షించేందుకు ప్రణాళికతో అడుగులేస్తున్నాం. అడవి అభివృద్ధికి సైతం అన్ని రకాల కృషి జరుగుతోంది. ఇక్కడికొచ్చే సందర్శకులకు వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో

ప్రతిభ వెలికి తీసేందుకే పోలీసు డ్యూటీ మీట్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నామని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరం జరిగిన తర్వాత ఆధారాల సేకరణపై జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోనల్ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. జోనల్ స్థాయిలో... నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి(ప్రథమ), వికారాబాద్ సీఐ రఘురాం (ద్వితీయ), కొండాపూర్ ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రాంమోహన్‌రెడ్డి, నరేందర్, వికారాబాద్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట లఘు క్రీడామైదానంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ కార్యదర్శి సౌందర్య వెల్లడించారు. 7వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథాన్ పోటీలు

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: భారతీయ సాంకేతిక సంస్థ-హైదరాబాద్(ఐఐటీహెచ్) రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ పేరుతో పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ రాష్ట్రాలు, నగరాలకు చెందిన వారిని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 1న ఐఐటీ క్యాంపస్ ఆవరణలో ఉదయం 5 గంటలకు 21.1 కి.మీ. హాఫ్ మారథాన్, 10, 5 కి.మీ పరుగు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు https://www.iithydrunnersclub.comegistration ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పతకాలు, ధ్రువపత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలు.. ఐదు బలవన్మరణాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే రోజు ఐదు ఘటనలు జరగడం.. జిల్లా పోలీసులను ఉలికిపాటుకు గురిచేసింది.

ఆ తల్లి శోకం తీరనిది..



లక్ష్మణ్

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: భర్త దూరం కాగా, ఉన్న ఒక్క కొడుకే తన సర్వస్వం అనుకుంది ఆ తల్లి. ఇంతలో ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెకు తీరని వేదన మిగిలింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అల్లాదుర్గంకు చెందిన లక్ష్మి భర్త నర్సింలు పదేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కూలీ పనులు చేస్తూ కుమారుడు లక్ష్మణ్(23)ను పోషించింది. కూలీ పని చేసుకొని దసరాకు దుస్తులు కొనుక్కొని వస్తానని కుమారుడు పది రోజుల క్రితం సంగారెడ్డికి వెళ్లాడు. శుక్రవారం అల్లాదుర్గం శివారులోని పటేల్ చెరువులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు పరిశీలించి.. దుస్తుల ఆధారంగా లక్ష్మణ్‌దని నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భార్య ఆరోగ్యం క్షీణించడంతో..



మహేశ్

చిలప్‌చెడ్: మెదక్ జిల్లా చిలప్‌చెడ్‌కు చెందిన మహేష్(33), సావిత్రి భార్యాభర్తలు. సావిత్రి ఆరోగ్యం క్షీణించడంతో 15 రోజులుగా పుట్టింట్లో ఉంటోంది. మనస్తాపం చెందిన భర్త శుక్రవారం తన పెద్దన్న యాదయ్య ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సావిత్రి ఫిర్యాదు మేరకు చిలప్‌చెడ్ ఎస్సై యాదగిరి కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..



క్రిష్ణ

కౌడిపల్లి: కౌడిపల్లికి చెందిన బర్ల క్రిష్ణ(44), శోభ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. అతను వ్యవసాయం, సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె వార్డు మాజీ సభ్యురాలిగా పనిచేశారు. ఒక కుమార్తెకు పెళ్లి చేశారు. వివిధ అవసరాలకు చేసిన అప్పులు తీరక క్రిష్ణ సతమతమవుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. భార్య శోభ ఫిర్యాదుతో ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కుమారుడు లేకపోవడంతో తల్లి లచ్చమ్మ అంత్యక్రియలు చేసింది.

ఇంటికి చేసిన అప్పు భారమై..



మహేష్

కొండపాక గ్రామీణం: కొండపాకకు చెందిన శ్రీరాం మహేష్(38), రమ దంపతులకు ఒక కుమార్తె ఉంది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల రూ.3 లక్షలు అప్పు చేసి కొత్తింటిని నిర్మించుకున్నారు. 15 రోజుల క్రితమే గృహప్రవేశం చేశారు. చేసిన అప్పు తీర్చే విషయంలో మనస్తాపం చెందిన మహేష్ శుక్రవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రమ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

భూవివాదంతో మనస్తాపం చెంది..



అశోక్

రామాయంపేట: ఎకరం భూ వివాదంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌కు చెందిన ఎర్ర అశోక్(38)కు దాయాదులకు సుమారు ఎకరా భూమి విషయమై కొంత కాలంగా వివాదం నెలకొంది. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. మనస్తాపం చెందిన అశోక్ తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబీకులు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించమని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భూ వివాదంతోనే తన భర్తను చంపారని భార్య బాబాయి ఆరోపించింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందించడమే లక్ష్యం

ములుగు, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలపై చేసిన పరిశోధనల ఫలితాలను రైతులకు అందించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పరిపాలన విభాగం కార్యాలయంలో వర్సిటీ, వీవీయో గ్లోబల్ సంస్థల మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. వీవీయో గ్లోబల్ సంస్థ.. దక్షిణ కొరియా దేశానికి చెందిన పలు సంస్థలతో కలిసి పరిశోధనలు చేస్తుందన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, విజయ, సంస్థ ప్రతినిధి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



పత్రాలు మార్చుకుంటున్న నీరజ ప్రభాకర్, వీవీయో గ్లోబల్ సంస్థ ప్రతినిధులు

ఉపాధ్యాయుల కృషితోనే బడుల పరిరక్షణ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సంఘం జిల్లా స్థాయి అధ్యయన తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సమాజం పట్లలోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ రకాల కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోందన్నారు. సర్కారు పాఠశాలల పరిరక్షణకు ప్రతి యూటీఎఫ్ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యారంగ పరిణామాలు అనే అంశంపై కార్యకర్తలకు బోధించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్, కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

మలుపులో ఢీకొన్న బస్సు, కారు

ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు

కల్హేర్, న్యూస్‌టుడే: మలుపు వద్ద ఆర్టీసీ బస్సు-కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. రేగోడు మండలం గజ్వాడలోని ఒకే కుటుంబానికి చెందిన భూమవ్వ(55), పాపయ్య, దుర్గయ్య, స్వరూప, రుత్వి, పుంతి హైదరాబాద్‌కు వెళ్లి శుక్రవారం తిరుగు పయనమయ్యారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో భూమవ్వ(55) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త పాపయ్య, కుమారుడు దుర్గయ్య, కోడలు స్వరూపలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్సులో నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారి పరిస్థితి విషమంగా ఉండటంతో పాపయ్య, స్వరూపను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని ఎస్సై పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బైక్ అదుపుతప్పి యువకుడు..



జావిద్

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోమిన్‌పేట ఠాణా పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై అరవింద్ తెలిపిన ప్రకారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం కటికె గేరికి చెందిన మహ్మమద్ పాషమియా, ఫర్జాన దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. చిన్నకుమారుడు మహ్మమద్ జావీద్(24), అతని మిత్రుడు మఫాజ్‌పటేల్‌తో కలిసి గురువారం కోట్‌పల్లికి వెళ్లారు. అదే రోజు రాత్రి సదాశివపేటకు తిరిగి వస్తుండగా, మండల పరిధి మోరంగపల్లి శివారులో రోడ్డుపై గుంత ఉండడంతో, వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. జావిద్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మఫాజ్‌కు గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి గాంధీకి తరలించారు. శుక్రవారం జావీద్ అన్న హనీఫ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వివరించారు.

సర్పం.. స్నేహపూర్వకం



పాములు.. రైతులకు, వన్యప్రాణుల సమతుల్యానికి స్నేహకారకమయ్యేవి. అన్ని పాములూ విషపూరితమైనవి కావు. వీటి అవగాహన కోసం 70వ 'వన్యప్రాణి వారోత్సవాలు' పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రాకేశ్ ప్రదర్శన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, అటవీ శాఖ సిబ్బందికి సర్పాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీవో జయదేవ్ ఆర్య, అటవీశాఖ క్షేత్ర అధికారి ఇక్రముద్దీన్, దుబ్బాక రేంజ్ అధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

ఈఎస్‌ఐ ఆసుపత్రికి రెండోసారి తాళం



తూప్రాన్, న్యూస్‌టుడే: పుర పరిధి పోతురాజుపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్‌ఐ ఆసుపత్రికి యజమాని తాళం వేయడంతో సేవలు నిలిచిపోయాయి. పది నెలలకు సంబంధించిన అద్దె బకాయిలు రాకపోవడంతో గత ఏప్రిల్‌లో తాళం వేశాడు. అప్పుడు బకాయిలు చెల్లించి తాళం తీయించారు. పుర పరిధిలోకి మారాక దాని ప్రకారం అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ మరోసారి శుక్రవారం తాళం వేశాడు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడు సాయిభరత్‌ను వివరణ కోరగా.. అద్దె పెంచాలని కోరుతూ యజమాని తాళం వేశాడన్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

నలుగురు దొంగల రిమాండ్

చేగుంట, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేస్తూ అందులో నుంచి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపారు. హరియాణకు చెందిన జుబేర్‌ఖాన్, ఇర్షాద్, రాజస్థాన్‌కు చెందిన ఫజార్, జాహిద్‌లు చేగుంట పోలీసుస్టేషన్ పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లిలో విద్యుత్తు నియంత్రికను 15 రోజుల క్రితం ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను చోరీ చేసి విక్రయించారు. అలాగే గత నెలలో మాసాయిపేటలో జప్తు చేసిన రైస్‌మిల్లులో ఉన్న విద్యుత్తు నియంత్రికలోని కాపర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. వీటిని విక్రయించేందుకు కారులో తీసుకెళ్తున్నారు. వడియారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి వారిని పట్టుకొని విచారించగా రెండో చోట్ల చోరీ చేసినట్లు అంగీకరించారు. కారుతో పాటు అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాశకు పోయి.. జైలుపాలు

పురాతన విగ్రహం చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

టేక్మాల్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాల్సిన యువకులు అత్యాశకు పోయి జైలుపాలయ్యారు. జైన విగ్రహాన్ని చోరీ చేసి విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన అనువింద్, జగత్, పెద్దపేటకు చెందిన శుభానంద్, కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన తేజసాయిబాబు, పామర్రుకు చెందిన మహేశ్‌బాబు హైదరాబాద్‌లో బీటెక్ చదివారు. రాత్రికిరాత్రే డబ్బులు సంపాదించాలని యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ఆధారంగా పురాతన దేవాలయాలు గుర్తించారు. వెల్పుగొండలోని గుట్టపై పార్శ్వనాథుని పురాతన విగ్రహం ఉన్న విషయం తెలుసుకున్నారు. జులై 26న ఇక్కడికి చేరుకొని విగ్రహాన్ని తీసుకెళ్లారు. విగ్రహానికి సరైన ధర రాకపోవడంతో అమ్మలేదు. గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. విగ్రహాన్ని గ్రామస్థులకు అప్పగించి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, టేక్మాల్ ఎస్సై రాజేశ్‌లు ఉన్నారు. వెల్పుగొండ మాజీ సర్పంచి నారాయణతో పాటు గ్రామస్థులు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి డీఎస్పీ, సీఐ, ఎస్సైలను సన్మానించారు.



టేక్మాల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

చేపల వేటకు వెళ్లి యువకుడి దుర్మరణం



మల్ల రాజు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని నర్సాపురానికి చెందిన రెడ్డిమల్ల మల్లవ్వ, శరబంధు దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. గతంలోనే శరబంధు మృతి చెందాడు. మల్లవ్వ కూతురు పెళ్లి చేసింది. కుమారుడు రాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కోమటిచెరువు నుంచి బయటకు వచ్చే నీటిలో మంగళవారం గాలం వేశాడు. బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నీటిలో రాజు మృతదేహం తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ఆరేళ్లకు రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం



ఇందిరా గాంధీ స్టేడియంలోని క్రీడా మైదానం

పోటీలో పాల్గొనే వారి వివరాలు
జట్లు: 10 (ఉమ్మడి జిల్లాలు)
వ్యాయామ ఉపాధ్యాయులు: 42
రిఫరీలు: 06
కోచ్‌లు, మేనేజర్లు: 20
క్రీడాకారులు: 180

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు బాక్సింగ్ అకాడమీగా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానం.. ఆరేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. 2017-18లో జాతీయ, 2016-17 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఇక్కడే జరిగాయి. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు చొరవతో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు ఆరేళ్ల కిందట మైదానాన్ని మూసేశారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తవగా, దీని మధ్యలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో ఫుట్‌బాల్ మైదానాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఇందులోనే పోటీలు జరుగనున్నాయి. స్టేడియం మొత్తం 7 ఎకరాలలో విస్తరించి ఉండగా, ఇక్కడ నిర్మించి గ్యాలరీలో 20 వేల మంది ప్రేక్షకులు కూర్చోవచ్చు.


మూడు రోజులు

ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగనున్నాయి. ఇందిరాగాంధీ మైదానంతో పాటు వెస్లీ పాఠశాల మైదానంలోనూ పోటీలు జరుగనున్నాయి. మొత్తం 24 మ్యాచ్‌లు జరుగుతాయి. స్థానిక టీజీ ఆర్‌ఎస్ పాఠశాలలో క్రీడాకారిణులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

- రాష్ట్రంలో పచ్చికతో కూడి ఉన్న ఏకైక స్టేడియం మెదక్‌దే కావడం విశేషం. 110 మీ. పొడవు, 70 మీ. వెడల్పుతో విస్తరించి ఉంది. జాతీయ స్థాయి పోటీలు పచ్చిక మైదానాల్లోనే కొనసాగుతాయి.

- న్యూస్‌టుడే, మెదక్ టౌన్

అన్ని ఏర్పాట్లు పూర్తి..: నాగరాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి



క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆరేళ్ల తర్వాత తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలు జిల్లాలో జరుగుతున్నాయి. ప్రశాంతంగా పూర్తిచేసేలా, జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు వచ్చేలా అందరం కలిసి కృషి చేస్తున్నాం.

పండగల వేళ రైట్.. రైట్

- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- రద్దీకి అనుగుణంగా నడిపేందుకు కార్యాచరణ

బతుకమ్మ, దసరా పండగలను అత్యధికులు సొంతూరిలో వేడుక చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఇందుకు సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్టీసీ బస్సు ప్రయాణానికి మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో పండగల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది.

ప్రత్యేక సర్వీసులు ఇలా.. (డిపో / బస్సులు)

డిపో	బస్సులు	డిపో	బస్సులు
మెదక్	79	నర్సాపూర్	97
నారాయణఖేడ్	55	సిద్దిపేట	59
సంగారెడ్డి	72	దుబ్బాక	13
జహీరాబాద్	86	పరిగి	16
తాండూరు	10	వికారాబాద్	8
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	39		

రీజియన్ పరిధిలో..

మెదక్ రీజియన్ పరిధిలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 8, రంగారెడ్డి రీజియన్‌లోకి వచ్చే వికారాబాద్ జిల్లాలో మూడు డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. పండగల సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా 500 సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ప్రత్యేక సర్వీసులు ఈనెల 11 వరకు నడిపిస్తారు.

ఇబ్బంది లేకుండా..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు చెందిన చాలా మంది ఉద్యోగ, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. కొంతమంది అక్కడే స్థిరపడ్డారు. బతుకమ్మ, దసరా పండగలకు వారిలో అత్యధికులు సొంతూరికి వస్తుంటారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపించనున్నారు.



- వికారాబాద్ జిల్లాలో పాఠశాలలకు చెందిన 40 బస్సులు వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు.

ముందస్తు రిజర్వేషన్‌కు..

దూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తుగా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. ముందస్తు టికెట్ రిజర్వేషన్‌కు www.tsrtconline.in/www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సి ఉంటుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, పరిగి

సద్వినియోగం చేసుకోవాలి: ప్రభులత, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్



బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈమేరకు డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చాం.

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో అర్చకుడు గిరీశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులతోపాటు భక్తులు తరలి వచ్చారు. నిర్వాహకుడు సురేశ్‌గుప్తా దంపతులతోపాటు దుర్గాప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం

తూప్రాన్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుక్రవారం మండల పరిధి అల్లాపూర్ టోల్‌గేట్ వద్ద కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన తరవాత మొదటిసారిగా హైదరాబాద్ నుంచి సొంత జిల్లా నిజామాబాద్ వెళుతుండగా.. తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు.

రామాయంపేట, న్యూస్‌టుడే: పార్టీకి సేవ చేసే కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతూ రామాయంపేటలో ఆగారు. ఈ సందర్భంగా ఆయనను రామాయంపేట, మెదక్, నిజాంపేట, చిన్నశంకరంపేట నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

అర్బన్ ప్రాథమిక కేంద్రం ఏర్పాటుకు చర్యలు

తూప్రాన్, న్యూస్‌టుడే: పట్టణంలో అర్బన్ ప్రాథమిక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తూప్రాన్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సమీపంలోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 6 పడకల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి అనువైన స్థలం కావడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పుర కమిషనర్ ఖాజా మొయినొద్దీన్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ ప్రభుదాస్, వైద్యాధికారులు ఉన్నారు.

సుందరీకరణ పేరిట కాలయాపన

మెదక్ టౌన్: సుందరీకరణ పేరుతో ఎమ్మెల్యే రోహిత్‌రావు కాలయాపన చేస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్నారు.. తప్ప అభివృద్ధి లేదని మెదక్ ఏరియా సీపీఎం కమిటీ కార్యదర్శి మల్లేశం ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో చిన్నారుల కోసం ఉన్న పార్కును పదేళ్లుగా మూసి ఉంచుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. దేవయ్య, బాల నర్సయ్య, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం: డీపీవో

చిలప్‌చెడ్: చెరువు కట్టలను ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ఎక్కడా చెరువు, కుంటల కట్టలు ఆక్రమణకు గురికాకుండా రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డీపీవో యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్కుల్, చిలప్‌చెడ్ గ్రామాలను డీపీవో సందర్శించారు. చిలప్‌చెడ్ గ్రామస్థుడు జయరాజ్ చేసిన ఫిర్యాదు మేరకు గ్రామాన్ని సందర్శించి గ్రామ పెద్ద చెరువు కట్టను కొందరు అక్రమంగా ఆక్రమించి ఏర్పాటు చేసిన పశువుల పాకల వివరాలను సేకరించారు. ఆక్రమణకు పాల్పడిన వారికి వెంటనే నోటీసులు ఇచ్చి వాటిని తొలగించాలని తహసీల్దార్ ముసాదిక్, కార్యదర్శి కృష్ణకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనుల తీరును తెలుసుకున్నారు. ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో శ్యామ్‌కుమార్ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

హరితహారం మొక్కలు ధ్వంసం

మనోహరాబాద్: మండల పరిధి పాలట నుంచి పోతారం వెళ్లే రహదారి పక్కనున్న విద్యుత్ పరిశ్రమ వద్ద చెట్టు నరకడంతో అవి హరితహారంలో నాటిన మొక్కలపైన పడ్డాయి. దీంతో మొక్కలు ధ్వంసమయ్యాయి. పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

హవేలిఘనపూర్: భారతీయ కిసాన్ సంఘ్ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ కోరారు. శుక్రవారం హవేలిఘనపూర్‌లో ఆయన మాట్లాడుతూ.... శనివారం కామారెడ్డిలో డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే మహాసభకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రం, శ్రీపాల్, సాయిలు, నరేందర్ రెడ్డి,రామచంద్రారెడ్డి ఉన్నారు.

పారిశ్రామిక ప్రాంతం.. ప్రమాదాల నిలయం

రహదారి పక్కనే నిలుపుతున్న వాహనాలు

న్యూస్‌టుడే, మనోహరాబాద్



కాళ్లకల్- ముప్పిరెడ్డిపల్లి రహదారిపై నిలిపిన భారీ వాహనాలు

పారిశ్రామిక ప్రాంతంలోని రహదారి గుండా నిత్యం భారీ, చిన్నతరహా వాహనాలు వందల్లో తిరుగుతుంటాయి. పరిశ్రమలకు ముడి సరకు తెచ్చే, ఉత్పత్తులు తీసుకెళ్లే భారీ వాహనాలు రోడ్డుపై నిలపడంతో అటుగా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని టీజీఐఐసీ ఆటోమోటివ్ పార్కు ప్రధాన రహదారిని విస్తరించారు. బీటీ వేసి మధ్యలో విభాగినిని నిర్మించారు. పరిశ్రమలకు ముడి సరకులు తెచ్చే, ఉత్పత్తి అయిన వస్తువులు తీసుకెళ్లే భారీ వాహనాలను రహదారిపై నిలుపుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పలుచోట్ల ఇదే సమస్య..

జాతీయ రహదారి నుంచి వీఎస్టీ పరిశ్రమ వరకు సుమారు 3 కి.మీ. మేర ప్రధాన రహదారి నిర్మించారు. ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన ఓ పరిశ్రమకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. గతంలో ఒకే వరుసగా ఉన్న రోడ్డును పూర్తిగా విస్తరించి బీటీ చేశారు. రెండు లైన్లుగా విస్తరించి విభాగినిని ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిపైనున్న ఇటుకల పరిశ్రమ వద్ద రెండు వైపులా, సేఫ్ ఎక్స్‌ప్రెస్ గోదాం, నాలుగు రోడ్డుల చౌరస్తా వద్ద రోడ్డు పక్కన వాహనాలు ఆపేస్తున్నారు. వాహనాలు వెళ్లడానికి ఒకే వరుస ఉండడంతోపాటు వెనక నుంచి వచ్చే వాటికి దారి ఇవ్వక పోవడంతో నెమ్మదిగా కదలాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

- వీరస్వామి, ఐలా కమిషనర్

కాళ్లకల్- ముప్పిరెడ్డిపల్లి టీజీఐఐసీ పారిశ్రామికవాడలోని ప్రధాన రహదారిని పూర్తిగా ఎక్స్‌ప్రెస్ వేగా వాహనాలు ఆగకుండా వెళ్లేలా ఏర్పాటు చేశాం. రహదారిపై వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటాం. పరిశ్రమల యజమానులకు నోటీసులిచ్చి రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రతి ఒక్కరి వివరాలు నమోదు

మెదక్, న్యూస్‌టుడే: ఒక కుటుంబం.. ఒక కార్డు లక్ష్యంగా డిజిటల్ కార్డులను అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మెదక్ పట్టణంలోని 20వ వార్డులో కొనసాగుతున్న డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్తగా కుటుంబంలో చేరిన వారి పేర్లను నమోదు చేయడం, ఉమ్మడి కుటుంబంలో వివాహాలు జరిగిన వారికి కుటుంబాల వారీగా కార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. డిజిటల్ కార్డులో మహిళలను కుటుంబ యజమానిగా పేర్కొనడం జరుగుతుందని పేర్కొన్నారు.

పక్కాగా ధ్రువపత్రాల పరిశీలన

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కాగా... వేగవంతంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మెదక్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలనను ఆయన పరిశీలించారు. శుక్రవారం వరకు మొత్తం 704 మంది అభ్యర్థులకు గాను 618 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యిందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ వివరించారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాధవి

కొల్చారం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారిణి మాధవి అన్నారు. మండల కేంద్రం కొల్చారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న త్రైమాసిక పరీక్షలను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రణాళిక, క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రతి అధ్యాపకుడు కష్టపడి పనిచేస్తున్నారని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో పాల్గొని కొత్త విద్యార్థులకు స్వాగతం పలికారు. చదవుతోపాటు అన్ని రంగాల్లో రాణించి కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. గతేడాది ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోనే కళాశాల మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వేణుమాదవ్, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

రామాయంపేట: పెద్దమ్మ ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం రామాయంపేట పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక భవన నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేయడంతో పాటు అందుకు సంబంధించిన పత్రాన్ని ముదిరాజ్ సంఘ సభ్యులకు అందజేశారు. అనంతరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంఘ నాయకులు సిద్ధిరాములు, నర్సింలు, నరేష్, రమేష్, మల్లేశం, నందు, స్వామి, బాగయ్య, కిషన్ తదితరులు ఉన్నారు.

తపస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా రేఖ

చేగుంట, న్యూస్‌టుడే: జిల్లా తపస్ మహిళా ఉపాధ్యక్షురాలిగా బాల్‌శెట్టి రేఖ ఎన్నికైనట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మన్‌లు తెలిపారు. చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రేఖ ఇప్పటివరకు చేగుంట మండల తపస్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆమె చేసిన సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో పదవి ఇచ్చినట్లు తెలిపారు.

మండలంలో కొనసాగుతున్న సర్వే



గొల్లపల్లిలో డిజిటల్ కుటుంబ సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లిలో డిజిటల్ కుటుంబ సర్వేను ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంట్లోని వారి వివరాలు నమోదు చేస్తున్నారు. గ్రామంలో రెండు బృందాలు సర్వే చేస్తున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో మధులత, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, శేఖర్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారుడి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వడానికి నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని కామారాన్ని ఎంపిక చేయడంతో సిబ్బంది రెండో రోజు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. ఎంపీవో గిరిజారాణి పర్యవేక్షించారు.

ఎస్సీ వర్గీకరణకు ఆందోళనలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ నాయకుడు మాసాయిపేట యాదగిరి మాదిగ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అతిథి గృహంలో జిల్లా ఎమ్మార్పీఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బాలరాజ్, పరశురాములు, శ్రీనివాస్, సామేల్ పాల్గొన్నారు.

తండాల్లో ఆధ్యాత్మికత పెరగడం హర్షణీయం

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: తండాల్లో ఆధ్యాత్మికత పెరగడం హర్షనీయమని ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సామ్లతండాలో గిరిజనులు జగదంబా మాత దీక్షలను చేపట్టి పూజలు చేశారు. సునితారెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వాములు దీక్షా విరమణకు మహారాష్ట్రలోని పౌర పట్టణానికి వెళ్లారు. కార్యక్రమంలో భారాస పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టెలికాం బోర్డు సభ్యుడిగా మల్లేశం

మిరుదొడ్డి: మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన భాజపాకు చెందిన మొగుళ్ల మల్లేశంను టెలికాం బోర్డు మెంబర్‌గా భారత ప్రభుత్వం నియమించినట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శుక్రవారం న్యూస్‌టుడేతో ఆయన చరవాణిలో మాట్లాడారు.. పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం దక్కుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. తనను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపూర్‌కు చెందిన సురేశ్ నియామకం..

నర్సాపూర్: జిల్లా టెలికాం బోర్డు సలహా సంఘం సభ్యుడిగా నర్సాపూర్ పురపాలిక 5వ వార్డు కౌన్సిలర్ సంగసాని సురేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు టెలికాం బోర్డు నుంచి శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. నియామకానికి కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. టెలికాం రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలువురు నాయకులు ఉన్నారు.

వార్షిక ప్రణాళిక సిద్ధం చేయండి: డీఆర్డీవో



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిన్నశంకరంపేట: ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని డీఆర్డీవో శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈజీఎస్ ద్వారా 2025- 2026 సంవత్సరంలో చేపట్టే పనులకు వార్షిక ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, ఏపీవో రాజ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

మెదక్ అర్బన్: పూలను పూజించే గొప్ప సంస్కృతి రాష్ట్రంలో ఉందని ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డీఎంతోపాటు మహిళా కండక్టర్లు, సిబ్బంది, చిన్నారులు బతుకమ్మ ఆడి సందడి చేశారు.

సీఐపై శాఖాపరమైన విచారణ

నర్సాపూర్: నాలుగేళ్ల కిందట నర్సాపూర్‌లో పని చేస్తూ పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురైన సీఐపై ఠాణాలో శుక్రవారం శాఖాపరమైన విచారణ నిర్వహించారు. ఓ పోలీసు ఉన్నతాధికారి సమక్షంలో విచారణ సాగింది. ఆరోపణలు ఎదుర్కొన్న సీఐతోపాటు ఫిర్యాదుదారులను ఆయన ఠాణాకు పిలిచి విచారించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

వెల్దుర్తి: మండల కేంద్రం వెల్దుర్తి పరిధి ఆరెగూడెం చౌరస్తా వద్ద శుక్రవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడిపేవారిని, సంబంధిత పత్రాల్లేకుండా తిరుగుతున్న, మైనర్లను ఎస్సై రాజు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, మద్యం తాగి నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బోరుబావికి దరఖాస్తులు సమర్పించండి

చిన్నశంకరంపేట: పొలాల వద్ద నీటి సౌకర్యం లేని ఎస్సీ రైతులు బోరుబావి తవ్వడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దామోదర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివాదంలో లేని భూమి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డులను మండల పరిషత్తు కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

చిన్నశంకరంపేట: కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను భాజపా గుర్తించి పదవులు కేటాయిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్లమెంట్ అసెంబ్లీ కన్వీనర్ డా.రామ్మోహన్‌గౌడ్, మండల అధ్యక్షుడు పోగుల రాజు, దశరథం, శ్రీనివాస్, రాజు, సుధాకర్, దేవరాజ్ పాల్గొన్నారు.

భాజపా ఆన్‌లైన్ సభ్యత్వానికి విశేష స్పందన

కౌడిపల్లి: భాజపా ఆన్‌లైన్ సభ్యత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మురళీధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు రఘువీరారెడ్డి, వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, రమణారావు, అశోక్, రాజేందర్, గోడ రాజేందర్ పాల్గొన్నారు.

ఎద్దు తరలిస్తున్న ఆటో అడ్డగింత

చిన్నశంకరంపేట: పట్టణానికి చెందిన ఓ వ్యాపారి శుక్రవారం రైతు వద్ద రూ.15 వేలకు ఎద్దును కొని వాహనంలో తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న భాజపా మండల అధ్యక్షుడు పోగుల రాజు వాహనాన్ని అడ్డుకున్నారు. రైతుతో మాట్లాడి ఎద్దును అతనికి అప్పగించారు.

అపురూపం.. అమ్మవారి దర్శనం



పాపన్నపేట: గోకుల్ షెడ్‌లో అమ్మవారికి పూజలు



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చనలు



కొర్విపల్లిలో గాయత్రీదేవిగా ...



నర్సాపూర్‌లో...

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకం, కుంకుమార్చన, అలంకరణ నిర్వహించారు. భక్తులు దర్శించుకొని తరించారు.

– న్యూస్‌టుడే బృందం



నార్సింగిలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అవార్డు విచారణకు రాని రెడ్డిపల్లి రైతులు

నర్సాపూర్: ప్రాంతీయ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో నర్సాపూర్‌లోని రైతు వేదికలో అవార్డు విచారణ శుక్రవారం కొనసాగింది. ఉదయం మూసాపేట, నాగులపల్లి గ్రామాలు, మధ్యాహ్నం చిన్నచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులతో సమావేశాలు నిర్వహించగా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎవరూ కూడా హాజరుకాలేదు. రెడ్డిపల్లి గ్రామ భూనిర్వాసితులకు కూడా నోటీసులు పంపగా వారు తీసుకోలేదు. ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో కోల్పోతున్న భూములకు ధర నిర్ణయించకుండానే అవార్డు విచారణ చేపట్టడం ఏంటని రైతులు అధికారులను ప్రశ్నించారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ ధరపై మూడింతల పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో తెలిపారు. ఎల్లారెడ్డిగూడెం తండాలో 19ఇళ్ల వరకూ రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్నామని వాటికి పరిహారం ఏవిధంగా చెల్లిస్తారని నిర్వాసితులు ప్రశ్నించారు. లోక్‌సత్తా కన్వీనర్ చంద్రశేఖర్ రైతుల తరఫున వినతి పత్రం అందించారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



విజేతకు బహుమతి అందిస్తున్న పట్టణ సీఐ నాగరాజు, డిపో మేనేజర్ సురేఖ

మెదక్ అర్బన్: సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని పట్టణ సీఐ నాగరాజు, మెదక్ డిపో మేనేజర్ సురేఖ అన్నారు. ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను ముగ్గురిని ఎంపిక చేసి వారికి శుక్రవారం సీఐ, డీఎం బహుమతులు అందించారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు శరీరానికి చక్కటి వ్యాయామం అవుతుందని ఎస్సై నారాయణ తెలిపారు. శుక్రవారం మండల పరిధి కామారంలో పాపయ్యగారి సంగారెడ్డి స్మారకార్థం ఆయన కుమారులు రామ్‌రెడ్డి, రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు.

గ్రామాల్లో సమస్యలు ఉండొద్దు

తూప్రాన్, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు లేకుండా చూడాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. శుక్రవారం ఆయన తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రితో కలిసి మండలంలోని వట్టూర్ గ్రామంలో పర్యటించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న నీటి సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిషన్‌భగీరథ ఏఈలు దివ్య, మీనా, ఏపీవో సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

డీసీఎం, లారీ ఢీ: డ్రైవర్‌కు గాయాలు

శివ్వంపేట: లారీ, డీసీఎం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండల కేంద్రం శివ్వంపేట నుంచి తూప్రాన్ వైపు వెళుతున్న డీసీఎంను నర్సాపూర్ వైపు ప్రయాణిస్తున్న లారీ మండల పరిధి మగ్దుంపూర్ వద్ద ఢీకొట్టడంతో రెండు వాహనాల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

మనోహరాబాద్: ఉపాధి కూలీ పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న వ్యక్తికి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన సంఘటన మండల పరిధి కాళ్లకల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన చీర్ల సత్తయ్య(56) కొన్ని రోజులుగా గ్రామంలోని నర్సరీలో ఉపాధి పనుల్లో భాగంగా మొక్కల పాదులు శుభ్రం చేస్తున్నాడు. పని పూర్తి చేసుకొని బయటకు వచ్చి కాళ్లు చేతులు కడుక్కుంటుండగా హఠాత్తుగా గుండెపోటు వచ్చి కిందపడ్డాడు. అక్కడే ఉన్న కూలీలు గమనించి హుటాహుటిన స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు అక్కడి నుంచి మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సత్తవ్వ, ముగ్గురు కూతుర్లు ఉండగా అందరి వివాహాలు అయ్యాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి..

రామాయంపేట: తాగుడుకు బానిసైన వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. కోమటిపల్లికి చెందిన సంఘం కనకరాజు(42) మేస్త్రీ పనులు చేసి జీవించేది. మద్యానికి బానిసైన ఆయన ఇంట్లో భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈనెల 2న మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం పొలం వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఎలుకల మందు తాగిన యువకుడు

శివ్వంపేట: మండల కేంద్రానికి చెందిన యువకుడు గురువారం రాత్రి ఎలుకల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.